
సాక్షి పల్నాడు

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023




దుర్గమ్మకు వెండి పాదాలు, హస్తాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు గుంటూరుకు చెందిన దవులూరు వెంకట మనోజ్ కుటుంబం శనివారం వెండి పాదాలు, హస్తాలను కానుకగా సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3711 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 759 విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఇసప్పాలెంలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ



నరసరావుపేటరూరల్: మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో శనివారం రాత్రి మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై గ్రామస్తులు నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహం, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ మోరబోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు, కొండపల్లి చినకోటయ్య, రాధారపు శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, శివలింగం రవీంద్రబాబు పాల్గొన్నారు.

జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దూర విద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. జిల్లా దూరవిద్య ఏసీడీసీ కె.ఎండీ.హుస్సేన్, ఏఐ కోఆర్డినేటర్లు కేవీ సుబ్బారెడ్డి, యు.వెంకటేశ్వరరావు, పి.ప్రభాకరరావు మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు కళాశాలలో సంప్రదించాలన్నారు. 14 ఏళ్లు నిండిన మహిళలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్నకు నీరాజనం



చిలకలూరిపేట భాస్కర్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రజలకు అభివాదం చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి క్రేన్‌తో భారీ గజమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

- పలుచోట్ల అన్నదానం
- రోగులు, పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ
- పాల్గొన్న మంత్రులు రజిని, అంబటి

నరసరావుపేట: ప్రజల హృదయాలలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పటికీ ఉంటారని మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు పేర్కొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- మాచర్ల నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర్, రింగురోడ్డు రైల్వేస్టేషన్ రోడ్లలో అల్పాహారం వడ్డించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- చిలకలూరిపేటలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని నేతృత్వంలో పార్టీ కార్యాలయంతోపాటు పట్టణంలోని కళామందిర్, భాస్కర్, అడ్డరోడ్డు సెంటర్లలో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, విడదల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.
- సత్తెనపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమాల్లో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం, గ్రంథాలయం, తాలూకా సెంటర్, రైల్వే గేటు వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గీతా మల్టీ స్పెషాల్టీ వైద్యశాలలో 20మంది మహిళలకు ఉచితంగా లాప్రోస్కోపీ ఆపరేషన్లు నిర్వహించారు. కలామ్ చేయూత నిర్వాహకుడు పెనుమూరి శరత్ ఆధ్వర్యంలో రూ.12వేలు విలువైన బల్లబండిని పేదలకు పంపిణీ చేశారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద పులిహోర పంపిణీ చేశారు. రాజుపాలెం మండలం గణపవరం, ముప్పాళ్ల మండలం దమ్మాలపాడులో వైఎస్సార్ విగ్రహాలకు మంత్రి అంబటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, పక్కాల సూరిబాబు, డాక్టర్ గీతాహాసంతి, చర్లంచర్ల సాంబశివరావు, తన్నీరు శ్రీనివాసరావు, పెండెం బాబూరావు పాల్గొన్నారు.
- నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణం, గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానం ప్రారంభించి పేదలకు దుప్పట్లు అందజేశారు. పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్పీటీసీ సభ్యులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.
- వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంలోని ఏనుగుపాలెంరోడ్డు, హనుమాన్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లలో నివాళులర్పించారు. వినుకొండ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని ముత్యాలంపాడు, దుర్గి మండలంలోని ఆత్మకూరు, కంచరగుంట గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించి నివాళులర్పించారు.
- గురజాల నియోజకవర్గంలో పిడుగురాళ్ల, మాచవరంలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, దాచేపల్లిలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి పలు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- పెదకూరపాడు నియోజవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అన్నదానం నిర్వహించారు. అచ్చంపేట, పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత బచ్చుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదానం చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



నరసరావుపేటరూరల్: ర్యాగింగ్ పెనుభూతం వంటిదని, దాని వలన చాలా దుష్పరిణామాలు ఉన్నాయని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆశీర్వాదంపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉంటే ఉద్యోగాలకు అనర్హులవుతారని తెలిపారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. ర్యాగింగ్‌కు గురైన వారు అధ్యాపకులకు, డయల్ 100కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినులు దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.విజయకుమార్, ఎస్.ప్రసాదు, బి.శ్యామ్‌శంకర్, పారా లీగల్ వలంటీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో కలెక్టర్ పర్యటన

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, మునమాక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శనివారం పర్యటించారు. ఈ గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు పరిశీలించి తొలగించిన ఓటర్ల జాబితాలపై పరిశీలన చేశారు. తొలగించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో స్వయంగా కలిసి వివరాలు సేకరించారు. రొంపిచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓట్ల తొలగింపుపై వివరంగా విశదీకరించారు. ఫారమ్–7 పై బూత్ లెవెల్ అధికారులు నిర్వహించిన ఎంక్వైరీ రిపోర్ట్‌లను నిశితంగా పరిశీలించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి షేషిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అంకారావు, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆర్ఐ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యను అందించండి

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

- బెత్తంతో కొట్టించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ
- నివ్వెరపోయిన ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయులు, అధికారులకు క్లాస్



ఎంఈఓలు, అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

వినుకొండటౌన్: విద్యకు సాంకేతికతను జోడిస్తూ విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్న తరుణంలో చదువును నేర్పే గురువులు బెత్తం ఉపయోగించడంపై పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అసహనం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బ్రాహ్మణపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆయన పాఠశాల గదిలోకి ప్రవేశించగానే అక్కడ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడి చేతిలో బెత్తం ఉండటంతో అసహనం వ్యక్తం చేస్తూ ఆయనే స్వయంగా ఉపాధ్యాయుడి చేత బెత్తంతో కొట్టించుకోవడంతో అధికారులు నివ్వెరపోయారు. అనంతరం ఉపాధ్యాయులకు, అధికారులకు తనదైన శైలిలో క్లాస్ ఇచ్చారు. ప్రభుత్వం విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొస్తూ నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దామని, బైజ్యూస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో ఆన్‌లైన్ ద్వారా పాఠాలు, ట్యాబ్‌లు ఇచ్చామని, ఇక బెత్తాలతో పనేముందన్నారు. కొందరు అధికారుల తీరు వల్ల విద్యావ్యవస్థకు చెడు పేరు వస్తుందని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, డిసెంబరు 31 నాటికి ఫేజ్ -1 కింద ఎంపికైన పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చోవడానికి వీలు లేదని అన్నారు. విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు పల్నాడు జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూడాల్సిన అధికారులు కాలక్షేపం చేస్తూ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండటంతో పాఠశాల విద్యాశాఖ అనుకున్న లక్ష్యాలు సాధించలేకపోతుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వినుకొండ పట్టణంలో ప్రవీణ్ ప్రకాష్ పర్యటన కొనసాగడంతో చుట్టు పక్కల మండలాల్లోని పాఠశాలల టీచర్లు అప్రమత్తమయ్యారు. మధ్యాహ్నం ఆయన ప్రకాశం జిల్లా పర్యటనకు వెళ్లడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయం,
ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, గుంటూరు

[illegible]/GNT/ 19-P /2023 తేదీ 02.09.2023

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]
పల్నాడు జిల్లా	తేదీ 11.09.2023 మధ్యాహ్నం 1.00 [illegible]	తేదీ 12.09.2023 మధ్యాహ్నం 1.00 [illegible]	తేదీ 14.09.2023 [illegible] 11.00 [illegible]

[illegible]

సం/- జాయింట్ కలెక్టర్ / చైర్మన్, [illegible] పల్నాడు జిల్లా



మాచర్లలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నరసరావుపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పిడుగురాళ్లలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



88త్యాళ్లూరులో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



దాచేపల్లి మండలం గామాలపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



వినుకొండలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

మహానేత ఆశయాల బాటలో నడవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీలు, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజారంజక పరిపాలనతో సంక్షేమ ప్రదాతగా నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలబాటలో అందరూ నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జెడ్పీ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి హెనీ క్రిస్టినా పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్సార్ ఆశయాలను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారని అన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, పొన్నూరు, వట్టిచెరుకూరు, కాకుమాను జెడ్పీటీసీలు కె.రమేష్, వెంకటలక్ష్మి, గుల్జార్‌బేగం, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో జవాను అంత్యక్రియలు

జే.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ నూతలపాటి సుధీర్ కుమార్ (38)కు అధికార లాంఛనాలతో శనివారం అత్యక్రియలు నిర్వహించారు. 2012లో సీఆర్‌పీఎఫ్ జవానుగా బాధ్యతలు తీసుకొని జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సెలవులపై ఇంటికి వచ్చి రెండు రోజులు క్రితం తన భార్య ఊరు గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు వెళ్లగా, అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు సుధీర్‌ను గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సుధీర్ మృతదేహాన్ని శనివారం స్వగ్రామం అయిన అలవలపాడు తీసుకొచ్చారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సుధీర్ మృతదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు సుధీర్‌కు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.